
జాతీయ జెండాలతో అలంకరించిన నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ భవనం

అవిశ్వాసం నెగ్గేనా?

- రేపే పాలమూరు పురపాలికలో అవిశ్వాస తీర్మానం
- కోరం లేకుంటే అవిశ్వాసం వీగినట్లే
- కోరంతో నెగ్గుతామన్న ధీమాలో కాంగ్రెస్
- ఇప్పటికే శిబిరాలలో ఇరు పార్టీల కౌన్సిలర్లు

మహబూబ్‌నగర్, జనవరి 25: అవిశ్వాస తీర్మానం గడువు దగ్గర పడుతున్న కొద్దీ ఏం జరుగుతుందోనన్న టెన్షన్ అధికార, విపక్షపార్టీల ముఖ్య నాయకుల్లో నెలకొన్నది. మరోవైపు.. ఓటింగ్‌లో పాల్గొనాల్సిన కౌన్సిలర్లు మాత్రం శిబిరాల్లో ఎంజాయ్ చేస్తున్నారు. మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ కోరమోని నర్సింహులు, వైస్ చైర్మన్ తాటిగణేష్‌లపై సభ్యులు అవిశ్వాస తీర్మానం కోరడంతో అధికారులు శనివారం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇక 27న ఏం జరుగబోతుందని అందరిలో ఉత్కంఠనెలకొంది. మరో 30 గంటల్లో ఈ ఉత్కంఠకు తెరపడనుంది. గడువు సమీపిస్తున్న కొద్ది అందరిలో ఆసక్తి నెలకొంది. ప్రస్తుత చైర్మన్, వైస్ చైర్మన్‌లను దించి వారి స్థానంలో పీఠం దక్కించుకోవాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉండగా, ఎలాగైనా మళ్లీ తమ పార్టీకి చెందిన మరో వ్యక్తిని చైర్మన్ చేయాలని బీఆర్ఎస్ పావులు కదుపుతోంది..

గైర్హాజరుకు బీఆర్ఎస్ ప్రయత్నాలు

బీఆర్ఎస్ తమ పార్టీకి చెందిన, తమకు మద్దతుగా నిలిచిన సభ్యులను ఓటింగ్‌కు హాజరుకాకుండా చేయాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంలో నేడు ఆ పార్టీ తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఇప్పటికే కొంతమంది సభ్యులతో బీఆర్ఎస్ శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఒకవేళ 17 మంది సభ్యుల బలం ఉంటే అవిశ్వాస ఓటింగ్‌కు దూరంగా ఉండాలని ఆ పార్టీ నాయకులు బావిస్తున్నారు. అందుకే తమ శిబిరంలో ఉన్న సభ్యులతో పాటు బీఆర్ఎస్ నుంచి వెళ్లిన అసంతృప్త కౌన్సిలర్‌ల మద్దతు కోసం నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకవేళ కోరం ఉండి అవిశ్వాస తీర్మానం అనివార్యమయ్యే పక్షంలో ఆ పార్టీ సభ్యులు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని చర్చ జరుగుతోంది.

33 మంది సభ్యులుంటేనే కోరం..

మునిసిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు చైర్మన్‌పై, మధ్యాహ్నం 12.30 గంటలకు వైస్ చైర్మన్‌పై అవిశ్వాస ఓటింగ్ నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించాలంటే మొత్తం కౌన్సిల్ 49 మంది సభ్యుల్లో 2/3వ వంతు అంటే 33 మంది సభ్యులు హాజరుకావాల్సి ఉంటుంది. 33 మంది, అంతకు ఎక్కువమంది సభ్యులు హాజరైతే వారిలో 50 శాతం ప్లస్ ఒకరు ఓటు వేస్తే సరిపోతుంది. పురపాలికలో ఎమ్మెల్యేకు కూడా ఓటు హక్కు ఉంది. అయితే కోరం ఉండాలంటే మాత్రం ఎమ్మెల్యేను మినహాయించి 33 మంది సభ్యులు ఉండాల్సిందే.. అంతకన్నా తక్కువ మంది హాజరైతే అవిశ్వాసం వీగినట్లేనని పురకమిషనర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు.


సమావేశంలో కౌన్సిల్ సభ్యులు (ఫైల్)

ఇప్పటికే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి 30 మంది సభ్యులు సంతకాలు చేసి కలెక్టర్‌కు అందజేశారు. మరి కొంత మంది కూడా కాంగ్రెస్‌కు మద్దతిస్తారని ఆ పార్టీ నాయకులు విశ్వసిస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న ఆరుగురితో పాటు బీజేపీ, ఎంఐఎం పార్టీలతో పాటు బీఆర్ఎస్‌లో చీలిక కౌన్సిలర్‌లు మెజారిటీ తమ వైపే ఉన్నారని అధికార పార్టీ ధీమాతో ఉంది. 33 మంది సభ్యులకన్నా ఎక్కువ మందే తమకు మద్దతుగా ఉన్నారని, అవిశ్వాస తీర్మానం నెగ్గుతామని ఆ పార్టీ నాయకులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇరుపార్టీల మద్దతుదారులు విహారయాత్రలో ఉన్నారు. శుక్రవారం రాత్రి లేదంటే, శనివారం నేరుగా మునిసిపల్ కార్యాలయానికి క్యాంప్‌ల నుంచి సభ్యులు చేరుకునే అవకాశం ఉంది.


నాగర్‌కర్నూల్ పోలీసు పరేడ్ మైదానంలో గణతంత్ర వేడుకలకు ఏర్పాటు చేసిన వేదిక

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి


గణతంత్ర వేడుకలకు సిద్ధం చేసిన పోలీసు పరేడ్ మైదానం

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 25: గణతంత్ర దినోత్సవానికి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టరేట్ భవనాన్ని విద్యుత్ దీపాలు, జాతీయ జెండాల తోరణాలతో అలంకరించారు. గణతంత్ర వేడుకలు నిర్వహించేందుకు పట్టణంలోని పోలీసు పరేడ్ మైదానంలో ప్రధాన వేదికతో పాటు అతిథులు కూర్చునేందుకు టెంట్లు, కుర్చీలతో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా పోలీసు కవాతు నిర్వహించేందుకు మైదానాన్ని శుభ్రం చేయడంతో పాటు వివిధ శాఖల అభివృద్ధిని ప్రదర్శించేందుకు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

శుక్రవారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లో జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించే గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ హాజరై జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించి, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు.

నీటి సరఫరా బంద్

- పల్లీ రైతులకు పుట్టెడు కష్టాలు
- వరి నాట్లకు ఇబ్బంది పడుతున్న రైతులు
- వర్షాభావంతో తగ్గిన భూగర్భ జలాలు
- అన్నదాతల్లో అయోమయం

నాగర్‌కర్నూల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రైతాంగానికి తీవ్ర నిరాశను మిగిల్చింది. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయం ప్రధానంగా జూరాల, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలపై ఆధారపడింది. అయితే వరుణదేవుడు ఈ ఏడాది కరుణించకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి.

ప్రధాన కాల్వల కింద ఊహించిన దాని కంటే ముందే నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆలస్యంగా వేసిన పల్లీ రైతులకు, ప్రస్తుతం వరినాట్లు వేయడానికి సిద్ధపడిన అన్నదాతలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాల్వల ద్వారా నీటి సరఫరా బంద్ కావడంతో పల్లీపంటను కాపాడుకోవడానికి అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ ఏడాది కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతం నుంచి ఆశించినంత స్థాయిలో వరద జలాలు రాకపోవడం కారణంగా శ్రీశైలం ప్రాజెక్టు నిండని విషయం తెలిసిందే. దీని పర్యవసనంగా దిగువ ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులపై తీవ్ర ప్రభావం పడింది. కృష్ణానదికి ఆశించినంత వరద జలాలు రాకపోవడం కారణంగా డెడ్ స్టోరేజీ చేరేపరిస్థితి ఉత్పన్నం కావడంతో మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా అవసరాలను దృష్టిలో పెట్టుకుని నెలరోజుల క్రితమే పంపిణీని నిలిపి వేశారు. కాల్వల ద్వారా నీటి సరఫరాను దృష్టిలో ఉంచుకుని పల్లీ వేసిన రైతాంగానికి అయోమయం నెలకొంది. కాల్వల కింద సాగు చేసిన పల్లీ పంటకు నీటి కోసం పక్క బోరు, బావులను ఆశ్రయించాల్సి వచ్చింది. భూగర్భ జలాలు కూడా తగ్గిపోవడంతో బోరు బావుల్లో నీరు లేక 15రోజుల్లో పల్లీ పంట చేతికి రావాల్సిన క్రమంలో దాన్ని కాపాడుకోవడానికి రైతాంగం ఆందోళన చెందుతున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో 1.10లక్షల ఎకరాల్లో పల్లీ పంటను సాగు చేయగా ఇంకా 40వేల ఎకరాల్లో పంట చేతికి రావాల్సిన క్రమంలో నీటి సమస్య తలెత్తడం రైతాంగానికి ఆందోళనకు గురి చేస్తోంది. ఈ సీజన్‌లో 1.20లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తామని ఆశించి తుకాలు పోసిన రైతులు కూడా మున్ముందు పరిస్థితి ఆశాజనకంగా ఉంటుందా లేదా అనే విషయంలో మీమాంస నెల కొంది. 215.807టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం కల శ్రీశైలం ప్రాజెక్టులో ప్రస్తుతం కేవలం 44.874 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాలం తిరిగి ప్రారంభమయ్యే వరకు కేఎల్ఐ ద్వారా నీటి పంపింగ్ జరిగే అవకాశం లేదు. ఈ క్రమంలో ఈ సీజన్‌లో వరి సాగు చేసినా నీటి సరఫరా విషయంలో రైతుల్లో సందిగ్ధత నెల కొంది.


ఒట్టిపోయిన కేఎల్ఐ కాల్వ

ఈ నెల 28న పాలమూరుకు

హోంమంత్రి అమిత్‌షా

- మూడు ఉమ్మడి జిల్లాల లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం

మహబూబ్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈనెల 28న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షా వస్తున్నట్లు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి చెప్పారు. అమిత్‌షా పర్యటన సమావేశాన్ని నిర్వహించడం కోసం పాలమూరులోని రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌ను గురువారం ఆయన పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతితో కలిసి పరిశీలించారు. భద్రతాపరంగా తీసు కోవాల్సిన అంశాలపై రూరల్ సీఐ స్వామితో చర్చించారు. ఈ సందర్భంగా జితేందర్ రెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ ఉమ్మడి జిల్లాల ముఖ్యనాయకులతో 28న అమిత్‌షా సమావేశమవుతారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలకు మూడు జిల్లాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, క్యాడర్‌ను సమాయత్తం చేసే ప్రణాళికను సమావేశం ద్వారా అమిత్‌షా నిర్దేశిస్తారని వెల్లడించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అచ్చుగట్ల అంజయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


మహబూబ్‌నగర్‌లోని రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో అమిత్‌షా పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తోన్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కుట్ర

- సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ సరిత



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సరిత

గద్వాల, జనవరి 25 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకముందే ప్రభుత్వ సిబ్బంది కొందరి ప్రోత్సాహంతో పార్టీని అప్రతిష్టపాలు చేసేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వారిపై చర్యలు తప్పవని జడ్పీ చైర్‌పర్సన్ సరిత హెచ్చరించారు. గద్వాల పట్టణంలోని జడ్పీ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. విద్యుత్, మిషన్ భగీరథ నీటి సరఫరాపై లైన్‌మెన్లు, సాగునీటి విడుదలపై వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ సిబ్బంది ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తనకు ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. అందుకు విద్యుత్ ఎస్ఈ భాస్కర్, మిషన్ భగీరథ ఈఈలు శ్రీధర్‌రెడ్డి, భీమేశ్వర్‌రావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, అగ్రికల్చర్ జిల్లా అధికారి గోవిందనాయక్‌లు స్పందించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడంతో పాటు వాస్తవాలను ప్రజల ముందు పెడ్తామని హామీ ఇచ్చారు.

సీఎంఆర్ ధాన్యం మాయంపై నిలదీత

పౌరసరఫరాల శాఖపై సమీక్ష నిర్వహిస్తుండగా, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు అమ్ముకున్నారని, వారిపై ఏం చర్యలు తీసుకున్నారని వడ్డేపల్లి జడ్పీటీసీ సభ్యుడు రాజు నిలదీశారు. అందుకు అధికారి రేవతి వివరణ ఇస్తూ జిల్లాలో మూడు మిల్లుల్లో ధాన్యం విక్రయించినట్లు తేలిందని, దీని విలువ రూ.17 కోట్లు అని తెలిపారు. వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో పాటు 16 మందికి నోటీసులు ఇచ్చామని చెప్పారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీల తరుపున ప్రచారం చేసిన డీలర్లపై చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ డిమాండ్ చేశారు. ఎస్సీలకు సంబంధించిన షాపులను బీసీలకు ఎలా కేటాయిస్తారని నిలదీశారు. దీంతో అధికారులు నీళ్లు నమిలారు. పట్టణంలోని ఈద్గా నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు కాగా, పనులు పూర్తి కాకుండానే మొత్తం బిల్లులు ఎలా చెల్లిస్తారని పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈలు రాజేష్, ఆంజనేయులను చైర్‌పర్సన్ నిలదీశారు.

అక్రమ క్వారీలను ఆపకపోతే నష్టం

జిల్లాలో అక్రమంగా నిర్వహిస్తున్న క్వారీలను అడ్డుకోకపోతే జిల్లా రూ.100 కోట్ల ఆదాయాన్ని కోల్పోతామని, ఇన్‌చార్జిగా ఉన్న తన ఒక్కడి ద్వారా వీలు కావడం లేదని మైనింగ్ ఏడీ విజయరామరాజు సభ దృష్టికి తెచ్చారు. భారత్‌మాల రోడ్డు నిర్వాహణకు అక్రమంగా క్వారీలను తీసుకెళ్తే, రూ.52.85 కోట్ల జరిమానా విధించామని తెలిపారు. కానీ ఆ మొత్తాన్ని చెల్లించకుండా నేషనల్ హైవే అథారిటీ, కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళ్లారని వివరించారు. ఆ తర్వాతనే క్వారీలకు అనుమతి తీసుకోవడంతో ఆరు కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని వివరించారు.

ఆసుపత్రిని వినియోగంలోకి తేవాలి

అలంపూర్ ఆసుపత్రిని వినియోగంలోకి తేవాలని, వైద్యులు, సిబ్బందిని కేటాయించాలని, వైద్య పరికరాలను బిగించాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కోరారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత పాలకులు ఎన్నికల ముందు హడావిడిగా ఆసుపత్రిని ప్రారంభించారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో కాంతమ్మ, డిప్యూటీ సీఈవో ముషాయిదా బేగం, జిల్లా అధికారులు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- పరిపాలనా భవనం వద్ద పీయూ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 25: పాలమూరు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని పీయూ జేఏసీ చైర్మన్ బత్తిన రాము డిమాండ్ చేశారు. గురువారం యూనివర్సిటీ విద్యార్థులు జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీగా పరిపాలనా భవనం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ కొన్నేళ్లుగా బాలికల హాస్టల్‌లో సమస్యలు ఉన్నాయని, అదేవిధంగా అంబులెన్స్ సదుపాయం లేదని అన్నారు. స్కాలర్ షిప్పులు, ఫీజు రీయిం బర్స్‌మెంట్ మంజూరు అయినా ఇవ్వడం లేదని ఆరోపించారు. హాస్టళ్లలో కప్‌బోర్డులు, ఫ్యాన్లు, లైట్లు, కిటికీలు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వాపోయారు. లైబ్రరీలో మ్యాగజైన్లు, నెట్, సెట్, తెలుగు అకాడమీ పుస్తకాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇంజనీరింగ్, లా కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ధర్నా వద్దకు రిజిస్ట్రార్ గిరిజామంగతాయారు, అకడమిక్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మహేశ్, మారుతి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఆశయాలకు అనుగుణంగా

మోదీ సర్కార్

- ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీయే ప్రధానమంత్రి
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 25 : యువత ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా మోదీ సర్కారు ముందుకు సాగుతోందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. జాతీయ ఓటర్స్ డే ను పురస్కరించుకొని గురువారం మహబూబ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫక్షన్ హాల్‌లో బీజేవైఎం అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'నవయుగ సమ్మేళనం' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రధాని మోదీ వివిధ రంగాలలో అద్భుతమైన మైలురాళ్లను అధిగమిస్తూ యువత బంగారు భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తున్నారని అన్నారు. దేశ అభివృద్ధి కోసం యువత నడుం బిగించాలని సూచించారు. అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ, కశ్మీరులో ఆర్టికల్ 370 రద్దు, కరోనా సమయంలో ఉచిత వ్యాక్సిన్, ఇలా చెప్పుకుంటూ పోతే నరేంద్రమోదీ దేశం కోసం ఎంతో చేశారని వివరించారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయని అన్నారు. దేశ ఆర్థిక స్థితి 10వ స్థానం నుంచి మూడో స్థానానికి వచ్చామని, 2047 కల్లా ప్రపంచంలోని అభివృద్ధి దేశాలతో పాటు మన దేశం కూడా ముందు వరసలో ఉంటుందని చెప్పారు. ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అవుతారని, కొత్త ఓటరైనా మీ మొదటి ఓటును పార్లమెంటు ఎన్నికల్లో సద్వినియోగం చేసుకోవాలని, ఇతరుల చేత కూడా ఓటువేయించాలని కోరారు. కలిసి నడుద్దాం, కలిసి ఆలోచిద్దాం, కలిసి సంకల్పిద్దాం, కలిసి దేశాన్ని ముందుకు తీసుకెళ్దాం అనే నరేంద్ర మోదీ పిలుపులో మనమందరం భాగస్వాములం అవుదామని కోరారు.

రాజకీయ సన్యాసానికి కాంగ్రెస్ నాయకులు సిద్ధం కావాలి

మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు వంశీ చందర్‌రెడ్డి డీకే అరుణపై చేసిన వ్యాఖ్యాలను మీడియా గుర్తు చేసిన సందర్భంగా ఆమె స్పందించారు. ఆయన ఒక రాజకీయ సంస్కారహీనుడు, ప్రతిపక్షంగా ఎదుర్కోలేక బట్ట కాల్చి మీదవేస్తే పాలమూరు ప్రజలు తనను గుర్తిసారని ఆయన అపోహలో ఉన్నారు. ఆరోపణలను రుజువు చేయక పోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, వాళ్ల పార్టీలోని పెద్దపెద్ద నాయకుల పేర్లు చెప్పాడు కదా వారుకూడా రాజకీయ సన్యాసం తీసుకునేందుకు సిద్ధంగా ఉంటే తాను వస్తానని ఆమె సవాల్ విసిరారు. మీరు డేట్‌ను ఫిక్స్ చేస్తారా.. నన్ను చేయ మంటారా అని సవాల్ చేశారు. కార్యక్ర మంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణవర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు ఏపీ మిథున్‌రెడ్డి, జయశ్రీ, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అంజయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, వివిధ మండలాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో నరేంద్ర మోదీ వర్చువల్ సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

నేటి యువత దేశానికి భవిత

జడ్చర్ల : నేటి యువత దేశానికి భవిత అని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. జడ్చర్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన నవయుగ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు నమోదు చేసుకోవాలని, దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసేందుకు ఆశావహులు టికెట్‌ను ఆశించడం సహజమేనని, అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఎవరికి టికెట్ వచ్చినా కలిసి పనిచేసి, బీజేపీ అభ్యర్థిని గెలిపించుకుంటామన్నారు. కాంగ్రెస్ నాయకులు సంస్కారహీనంగా మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలలో బీజేపీ అభ్యర్థులు గెలిచారని, పార్లమెంట్ స్థాయిలో 10 నుంచి 12 స్థానాలలో బీజేపీ అభ్యర్థులు గెలుస్తారనే విశ్వాసం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, బీజేపీ నాయకులు సీతారాంనాయక్, సామల నర్సిములు, సాహితిరెడ్డి, కృష్ణాబాయి, తిరుపతి తదితరులు ఉన్నారు.

చౌడూర్ పెద్ద చెరువులో నీటి చౌర్యం

నవాబ్‌పేట, జనవరి 25 : మండల పరిధిలోని చౌడూర్ పెద్ద చురువు నుంచి అక్రమంగా మోటార్లు పెట్టి నీటిని చౌర్యం చేస్తున్నారని సర్పంచ్ వెంకటయ్య గురువారం నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటిని తరలించొద్దని గ్రామ ప్రజలు తీర్మానం చేసినట్లు తెలిపారు. అక్రమంగా నీటిని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మదనాపురం, జనవరి 25 : రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో గురువారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ నుంచి కాచిగూడకు వెళ్తున్న గూడ్స్ రైలును మండల కేంద్రంలోని రైల్వేగేటు సమీపంలో వ్యక్తి ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి 50 సంవత్సరాలు వయసు ఉంటుందని, గోధుమరంగు గల షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిమ్మాజిపేట, జనవరి 25 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రానికి సమీపంలో గురువారం ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో జక్కా సత్యనారాయణ(50) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానిక ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన జక్కా సత్యనారాయణ తన కుమార్తెను చూడడానికి బుధవారం సాయంత్రం గుమ్మకొండ గ్రామానికి వచ్చినట్లు గురువారం తిరుగు ప్రయాణం లూనాపై స్వగ్రామానికి వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కొల్లాపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. కుమారుడు శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుగుతున్నట్లు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తమై జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణోత్సవం సందర్భంగా మన్యంకొండ శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణ

మహబూబ్‌నగర్ రూరల్, జనవరి 25 : పౌర్ణమి పురస్కరించుకొని మన్యంకొండ శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల విగ్రహాలను పూలమాలలతో అలంకరించారు. అర్చకులు వేదమంత్రాలతో స్వామివారి కల్యాణోత్స వ వేడుక నిర్వహించారు. కల్యాణ దాతలు, భక్తులు పెద్ద సం ఖ్యలో ఈ కల్యాణోత్సవంలో పాల్గొని తిలకించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆళహరి మధుసూదన్‌కుమార్, ఆళహరి రామకృష్ణ, ఈవో శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో సినీనటుడు నవదీప్



అమ్మవారి ఆలయం ముందు సినీనటుడు నవదీప్

అలంపూర్ చౌరస్తా, జనవరి 25 : అలంపూర్ జోగుళాంబ అమ్మవారిని సినీ నటుడు నవదీప్ గురువారం దర్శించుకున్నారు. ముందుగా స్వామివారి సన్నిధిలో పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఈవో పురేందర్ కుమార్ తీర్థ ప్రసాదాలు అందించి ఆలయ ప్రాముఖ్యతను నవదీప్‌కు వివరించారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

▸▸ కాలిపోయిన దిచక్రవాహనం, ఇతర వస్తువులు

ఊట్కూర్, జనవరి 25 : ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పు అంటుకుని ఓ ద్విచక్ర వాహనం ఇతర వస్తువులు కాలిపోగా, రూ.1.50 లక్షల నష్టం జరిగింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం బిజ్వార్ గ్రామంలో చోటుచేసుకుంది. సంఘటన గురువారం మండలంలోని బిజ్వార్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పీర్లహన్మంతు అనే రైతు తన ఇంటి ముందుర గుడిసె వెసుకుని అందులోనే వంట చేయడంతో పాటు వాహనం ఇతర వస్తువులను పెట్టుకుకునే వాడు. బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంలో పెట్రోల్ పోసుకుని వచ్చి ఎప్పటి లాగే గుడిసెలో పెట్టి నిద్ర పోయాడు. గురువారం ఉదయం అతని భార్య లక్ష్మి వంట చేయడానికి గుడిసెలోకి వెళ్లి అగ్గిపుల్ల గీయగానే ఒక్కసారిగా ద్విచక్రవానానికి మంటలు అం టుకుని గుడిసె అంటుకుంది. వెంటనే తెరుకున్న లక్ష్మి బయటికి రాగా అక్కడే తన కూతురు ఉండటంతో కాపాడటానికి హన్మంతు కుమారుడు నర్సింహ గుడి సెలోకి పోయి అమ్మాయిని రక్షించాడు. ఈ ప్రమాదంలో నర్సింహ కుడి చేయి కాలిపోయింది. అయితే గుడిసెలో ఉంచిన ద్విచక్ర వాహనంతో పాటు సైకిలు, నాలుగు బస్తాల ఎండు మిరపకాయలు, ఇతర సామగ్రి కాలిపోయాయి.

రేపు చెకుముకి మండల స్థాయి పోటీలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 25 : విద్యార్థుల్లో విజ్ఞానాభిలాషను పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ సంబురాలలో భాగంగా మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ గౌడ్, వేణుగోపాల్‌వర్మ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని జేవీవీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 27న మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జేవీవీ ఉపాధ్యక్షులు వెంకటస్వామి, ప్రహ్లాద్‌రెడ్డి, కోశాధికారి ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

మూడు నెలల పసి బాలుడిని

ఎత్తుకెళ్లేందుకు యత్నం

▸▸ తల్లి అడ్డుకోవడంతో బాలుడిని వదిలి పారిపోయిన అగంతకులు ▸▸ ఉలిక్కిపడిన క్లబ్‌రోడ్డు



పోలీసులకు వివరిస్తున్న చిన్నారి తల్లిదండ్రులు

జడ్చర్ల, జనవరి 25 : ఊయలలో ఉన్న మూడు నెలల పసిబాబును ఎత్తుకెళ్లేందుకు ఇద్దరు ఆగంతకులు యత్నించిన సంఘటన జడ్చర్ల మునిసిపాలిటీ క్లబ్‌రోడ్డులోని విద్యానగర్‌కాలనీలో గురువారం చోటుచేసుకుంది. గొల్లపల్లి గ్రామానికి చెందిన రవిగౌడ్, కవితలు భార్యాభర్తలు. వీరికి మూడు నెలల పసిబాబు ఉన్నాడు. రవిగౌడ్ పనిపై తన షెడ్‌కు వెళ్లగా ఆ సమయంలో ఇంట్లో కవిత ఒక్కరే ఉన్నారు. అదే సమయంలో ఇంట్లోకి ఓ ఆగంతకుడు చొరబడ్డాడు. మరో ఆగంతకుడు ఇంటి ముందు ద్విచక్ర వాహనంపై ఉన్నాడు. ఇంట్లోకి చొరబడిన ఆగంతకుడు ఊయలలో ఉన్న మూడు నెలల బాబు మణిదీప్‌ను చేతిలోకి తీసుకుని, బాబును రవి అన్న తీసుకురమ్మన్నాడని, ఆసుపత్రికి వెళ్లేందుకు తీసుకురమ్మన్నాడంటూ రవిగౌడ్ భార్య కవితను నమ్మించేందుకు యత్నించాడు. చేతిలో తీసుకున్న బాబుతో ఇంట్లో నుంచి బయటికి వెళ్తున్న ఆగంతకుడి చేతిలో బాబును కవిత లాగేసుకుంది. బాబును ఎత్తుకెళ్లేందుకే ఆగంతకుడు వచ్చాడని గ్రహించిన కవిత, బాబును చేతుల్లోకి తీసుకుని గట్టిగా అరిచింది. ఆగంతుకుడిపై చేయి చేసుకుంది. తనపై చేయి చేసుకుంటావా అంటూ కవితను తిరిగి కొట్టి, పట్టుబడుతామన్న భయంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఇదే సందర్భంలో ఇంటి పక్కన ఉన్న వారు వచ్చి వెంటనే 100 డయల్‌కు ఫోన్ చేసి, జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి జడ్చర్ల పోలీసులు వచ్చి ప్రాథమిక విచారణ చేపట్టారు. రవిగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు జడ్చర్ల సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

నిత్యం వందలాది మంది తిరుగాడే ఈ క్లబ్‌రోడ్డులోని విద్యానగర్ కాలనీలో ఈ సంఘటన చోటుచేసుకోవడం తో కలకలం రేగింది.

ఆరోగ్య భారత్ కోసం నడక

▸▸ కాశీ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేపట్టిన యువకులు



పాదయాత్రగా వెళ్తున్న యువకులు

భూత్పూర్, జనవరి 25 : స్వస్త్ యువ.. స్వస్త్ భారత్ అనే నినాదంతో ఇద్దరు యువకులు కాశీ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేపట్టారు. గురువారం 44వ జాతీయ రహదారిపై వెళుతున్న ఆ యువకులను 'ఆంధ్రజ్యోతి' పలకరించగా పలు విషయాలను వివరించారు. హీరాలాల్ మహవర్ అనే ఇతను రాజస్థాన్‌కు చెందిన యువకుడు, హరియాణకు చెందిన దీపక్‌యాదవ్ అనే ఇద్దరు యువకులు జాతీయ సామాజిక సంస్థ ఆధ్వర్యంలో 2023 నవంబరు 17వ తేదీన కశ్మీర్‌లోని శ్రీనగర్ ప్రాంతం నుంచి పాదయాత్రను ప్రారంభించారు. వీరి పాదయాత్ర ఉద్దేశం ఏమిటంటే ప్రపంచంలోనే భారత దేశం ఆరోగ్యవంతమైన దేశంగా ఎదగాలని (ఆరోగ్యవంతమైన) భారత దేశం కోసం టూకేటూ నడక అనే నినాదంలో వీరు 90రోజుల పాటు 5వేల కిలోమీటర్ల దూరం పాదయాత్ర కాశీ నుంచి కన్యకుమారి వరకు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా భారత దేశంలో రసాయన మందులు వాడకుండా నాణ్యమైన పంటలు పండించడం, డ్రగ్స్ ఇతర మత్తు పానియాలు వాడకుండా పూర్తిగా నిషేధించాలని, ప్రతీ ఒక్కరు ఆరోగ్యవంతులుగా ఉండాలన్న ఆకాంక్షతో ఈ పాద యాత్రను చేపట్టినట్లు యువకులు తెలిపారు. నడక చేస్తున్న సందర్భాల్లో మార్గమధ్యలో గ్రామాలు కలిసినప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 67 రోజులు దాపుగా రెండు వేల కిలోమీటర్ దూరం వరకు పాదయాత్ర చేశామని అన్నారు. ఫిబ్రవరి 14వ తేదీన కన్యకుమారి చేరుకుంటామని, అక్కడ భారీ సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు యువకులు తెలిపారు.

ఉమామహేశ్వర క్షేత్రంలో

జీహెచ్‌ఎంసీ మేయర్



అమ్మవారిని దర్శించుకున్న జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి

అచ్చంపేట అర్బన్, జనవరి 25: ఉమామహేశ్వర క్షేత్రంలో గురువారం హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి ఈశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్, అర్చకులు వీరయ్య పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి ఈశ్వరునికి క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, గణపతి అయ్యప్పస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అర్చకులు వీరయ్య, నీలకంఠం, రాజశేఖర్, రవికుమార్‌లు ఆయనకు ఆలయ చరిత్ర వివరించారు.

డయల్ యువర్ ఆర్‌ఎంకు స్పందన

పాలమూరు, జనవరి 25 : ఉమ్మడి జిల్లా నుంచి ఆర్‌ఎం వి.శ్రీదేవి పలువురు ఫోన్‌లో సమస్యలను ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను గురువారం వివరించారు. ఫిర్యాదులు స్వీకరించిన ఆర్‌ఎం పరిష్కారానికి తగ చర్యలు చేపట్టారు.

మహమ్మదాబాద్, అమ్మాపూర్, భూత్పూర్, నవాబ్‌పేట, దేవరకద్ర, నర్వ, కొల్లాపూర్, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి అనేక మంది సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలను వివరించారు.

దళితులకు నేటికీ అన్యాయమే



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

పాలమూరు, జనవరి 25 : భారతదేశంలో 74ఏళ్ల రాజ్యాంగంలో సంపూర్ణంగా కులనిర్మూలన జరగాల్సిన అవసరం ఉందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు అన్నారు. విద్య, వైద్యరంగాలలో దళితులకు నేటికీ అన్యాయమే జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాలుర ఎస్సీ హాస్టల్ కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'రాజ్యాంగంపై ఎదురవుతున్న సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో డా.బి.ఆర్ అంబేడ్కర్ ఫొటో పెట్టాలని కోరారు. గణతంత్రం అంటే డా.బి.ఆర్ అంబేడ్కర్ సొంతం అని గాంధీజీకి ఎలాంటి సంబంధంలేదన్నారు. దేశంతోపాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ జెండా ఎగిరిన ప్రతీచోట డా.బి.ఆర్ అంబేడ్కర్ ఫొటో కచ్చితంగా పెట్టాలన్నారు. ఆ మహాపురుషుడు రెండున్నరేళ్ల కష్టపడి అన్ని తానై రచించిన భారతరాజ్యాంగానికి కమిటీలు 2008మంది ఉన్నారని, అందులో 16సార్లు సవరణలు జరిగాయని తెలిపారు. రాజ్యాంగ కమిటీలో ఎడుగురు ఉన్నప్పటికీ మొదటిపేజీ నుంచి చివరిపేజీ అంబేడ్కర్ మాత్రమే రచించారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా నేటివరకు ఎక్కువ పుస్తకాలు అమ్ముడుపోయి చదివినవి ఒకటి దాస్ క్యాపిటల్ గ్రంథం, రెండో అంబేడ్కర్ రచించిన భారతరాజ్యాంగం మాత్రమే అన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి యం.కుర్మయ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ డా.కృష్ణమోహన్, మాణిక్యంరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు భరత్ పాల్గొన్నారు.

ఇసుక డంపులను సీజ్ చేసిన అధికారులు



రావులపల్లి దగ్గర అక్రమంగా డంపు చేసిన ఇసుకను పరిశీలిస్తున్న తహసీల్దార్, పోలీసులు

భూత్పూర్, జనవరి 25 : ఎలాంటి అనుమతుల్లేకుండా నిల్వచేసిన రెండు ఇసుక డంపులను రెవెన్యూ పోలీస్ శాఖ అధికారులు గురువారం సీజ్ చేశారు. తహసీల్దార్ పులిరాజు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రావులపల్లి గ్రామ శివారులో ఉన్న వాగులో సర్వేనంబరు 95లో సతీష్‌రెడ్డికి చెందిన భూమిలో తొండ నాగభూషణం అనే వ్యక్తి అనుమతులు లేకుండా సుమారు 10 టిప్పర్ల ఇసుకను అక్రమంగా డంప్ చేసిన దాన్ని అధికారులు గుర్తించి సీజ్ చేశారు. అదే విధంగా అదే గ్రామ శివారులో సర్వే నంబరు 129లో అదే గ్రామ శివారులోని వెంకటయ్యకు సంబంధించిన ఇటుక బట్టి దగ్గర సుమారు 39 టిప్పర్ల ఇసుక డంపును అధికారులు గుర్తించి సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను కలెక్టర్ ఆదేశం మేరకు పూర్తి వివరాలతో నివేదిక పంపించినట్లుగా తహసీల్దార్ తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను వేలం వేయడానికి జిల్లా మైనింగ్ శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించినట్లుగా తహసీల్దార్ పేర్కొన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక తరలించినా, డంప్ చేసినా ప్రభుత్వ నిబంధనల మేరకు కఠినమైన చర్యలు ఉంటాయని తహసీల్దార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ వెంకటేష్, పోలీస్ ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ సుదర్శన్‌రెడ్డి, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

▸▸ ఆయిల్‌పామ్ పంట సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన, శిక్షణ

▸▸ ఐఐవోపీఆర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రుడు



రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త రామచంద్రుడు

తాడూరు, జనవరి 25: ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నటువంటి పెట్టుబడులతో కష్టంగా కాకుండా ఇష్టంతో సాగు చేసినట్లయితే తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని ఆయిల్ పామ్ జాతీయ స్థాయి సీనియర్ శాస్త్రవేత్త రామచంద్రుడు తెలిపారు. మండలంలోని మేడిపూర్ గ్రామంలోని సింగిల్ విండో వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఆయిల్‌పామ్ క్షేత్రంలో రైతులకు పంట సాగు యాజమాన్య పద్ధతులపైన ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఐఐవోపీఆర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రుడు రైతులకు చాలా క్లుప్తంగా పంట సాగుపై, పంట యాజమాన్య పద్ధతులు, నర్సరీ దశల్లో చేపట్టాల్సిన చర్యలు, ప్రధాన పొలంలో మొక్కలు నాటు విధానం, నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణపై చాలా వివరంగా రైతులకు వివరించారు. అదేవిధంగా ఈ మధ్య కాలంలో లేత ఆయిల్ పామ్ పంటలకు ఆశిస్తున్న మొవ్వకుళ్లు తెగుళ్ల వాటి నివారణ, అదేవిధంగా లేత తోటల్లో మెడ విరుపు తెగులు వంటి చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి కే సురేష్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటల్లో అంతరపంటల సాగు వాటి ఆవశ్యకత, మార్కెటింగ్, అదేవిధంగా ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ పంటలకు వచ్చే రాయితీల గురించి రైతులకు వివరించారు. ఐఐవోపీఆర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రుడు, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సురేష్, ప్రియునిక్ కంపెనీ డీజీఎం రామ్మోహన్‌రావు, నాగర్‌కర్నూల్ ఉద్యాన అధికారి కే మహేశ్వరి, కొల్లాపూర్ ఉద్యాన అధికారి ఎం.లక్ష్మణ్, కల్వకుర్తి ఉద్యాన అధికారి పి.ఇమ్రానా, ప్రియునిక్ కంపెనీ అగ్రనమిస్ట్ పణికుమార్, ఆయిల్‌పామ్ ఏరియా మేనేజర్ వి.రాకేష్, అన్ని మండలాల క్లస్టర్ ఆఫీసర్లు, ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతు సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మయ్య (ఫైల్)

రేవల్లి, జనవరి 25 : ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి జిల్లా రేవల్లి మండలం బండరాయిపాకుల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్ల గ్రామానికి చెందిన లక్ష్మయ్య(56), సుభద్ర దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు హైదరాబాద్‌లో చేపల వ్యాపారం చేస్తు జీవనం కొనసాగించేవారు. మద్యానికి అలవాటు పడిన లక్ష్మయ్య తరచు భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు. గత ఐదు సంవత్సరాల నుంచి భార్యను వదిలి లక్ష్మయ్య కూలీ పని చేస్తు జీవనం కొనసాగిస్తు ఉండేవాడు. తరచు ఏదైనా పని ఉంటే బండరాయిపాకులలో గల తన తమ్ముడు స్వామి దగ్గరికి వచ్చి పని చేసేవాడు. ఆదివారం పనికి వెళ్తున్నానని చెప్పి తన తమ్ముడు స్వామి వద్ద నుంచి వెళ్లిపోయాడు. ఊరు వెళ్లి ఉంటాడని భావించిన తమ్ముడు చూసుకోలేదు. గురువారం బండరాయిపాకుల గ్రామ శివారులో ఒక చెట్టుకు ఉరి వేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని చూసిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి చూడగా షర్టు జేబులో ఆధార్ కార్డు కనిపించింది. దాని ఆధారంగా పోలీసు లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. హైదరాబాద్‌లో ఉన్న భా ర్య సుభద్ర వచ్చి మృతదేహాన్ని చూసి తన భర్త లక్ష్మయ్య అని నిర్ధారించింది. సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

అన్నపై తమ్ముడి దాడి

▸▸ చికిత్స పొందుతూ మృతి



సేవ్యా (ఫైల్)

బల్మూరు, జనవరి 25 : వంట చెరుకు విషయంలో అన్నదమ్ముల మధ్య జరిగిన స్వల్ప మాటలతో చివరకు అన్నపై తమ్ముడు దాడి చేసే వరకు జరిగిన సంఘటన ఈ నెల 11న చోటు చేసుకోగా, చికిత్స పొందుతూ సేవ్యా(60) గురువారం మృతి చెందాడు. ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన మూడావత్ సేవ్యా(60) అనే వ్యక్తిపై తన తమ్ముడు మూడావత్ హాతిరాం అక్కడే ఉన్న కట్టెను తీసుకుని సేవ్యా తలపై కొట్టడంతో స్పృహ కోల్పోయాడు. సేవ్యాను కుటుంబ సభ్యులు అచ్చంపేట ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు హరికృష్ణ ఫిర్యాదు మేరకు అచ్చంపేట సీఐ అనుదీప్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. హైదరాబాద్ ఉస్మానియాలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

రైతు అవయవదానం

▸▸ కుటుంబ సభ్యుల అంగీకారంతో లివర్, కిడ్నీలు దానం



సురేశ్ (ఫైల్)

మహబూబ్‌నగర్, జనవరి 25 : రోడ్డు ప్రమాదంలో తీవ్రగాలై బ్రెయిన్‌డెడ్ అయిన యువరైతు అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. పాతికేళ్ల నిండని యువరైతు చనిపోయాడన్న పుట్టెడు దుఖంలో ఉన్న ఆ కుటుంబం బాధను దిగమింగుతూ అవయదానం వల్ల తమ బిడ్డ ఇతరుల రూపంలో జీవించి ఉంటాడని అవయదానం చేశారు. మక్తల్ సమీపంలోని పసుపుల గ్రామానికి చెందిన యువరైతు సొప్పరి సురేశ్ (24) ఈనెల 22 ద్విచక్రవాహంపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో హైదరాబాద్ కిమ్స్‌కు తరలించగా, చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. అవయదానం కోసం కిమ్స్ ఆసుపత్రిలోని అవయవదాన సమన్వయకర్తలు మృతుడి భార్య, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. తమ బిడ్డ చనిపోయిన మరో ముగ్గురిలో జీవించే ఉంటాడని భావించి లివర్, కిడ్నీలు అవయవదానం చేశారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

▸▸ ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిమన్స్ గుప్తా

జడ్చర్ల, జనవరి 25 : జాతీయ రహదారిపై రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిమన్స్‌గుప్తా సూచించారు. జడ్చర్ల మండలంలోని కిష్టంపల్లి గ్రామ సమీపంలోని జడ్చర్ల లారీ అసోసియేషన్ భవనంలో మహబూబ్‌నగర్ ఆర్టీవో, వెస్ట్రన్ ఆంధ్ర టోల్‌ప్లాజా శాఖాపూర్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జాతీయ రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిమన్స్‌గుప్తా మాట్లాడుతూ వాహనాలను నడిపే సందర్భంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లారీలకు ఉచితంగా ఎరుపు రంగు రేడియం స్టిక్కర్‌లను అతికించారు. ఎన్‌హెచ్‌ఏఐ డీజీఎం కోట బాబు, ప్రాజెక్ట్ మేనేజర్ దీప, అసోసియేషన్ అధ్యక్షుడు జహంగీర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నరేశ్‌లతో పాటు సంతోష్‌కుమార్, బాల మురుగన్, రాకేష్‌గౌడ్, జితేందర్, సురేందర్‌రెడ్డి, పరమేష్, రాము, అంజద్, లారీ ఓనర్స్ డ్రైవర్‌లు కుమార్‌గౌడ్, కైసర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు అడ్వయిజరీ సభ్యురాలిగా అంజమ్మ



పత్తి అంజమ్మ

మహబూబ్‌నగర్, జనవరి 25 : కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు అడ్వైజరీ ప్యానల్ సభ్యురాలిగా పాలమూరుకు చెందిన పత్తి అంజమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. అంజమ్మ ఈ పదవిలో రెండేళ్ల పాటు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని టీడీగుట్టకు చెందిన అంజమ్మ 2001 నుంచి బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. బీజేపీలో పట్టణ ఉపాధ్యక్షురాలిగా, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా, బీజేపీ జిల్లా ఉపా ధ్యక్షురాలిగా, మహిళామోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పని చేశారు. 2004, 2009లలో కౌన్సిలర్‌గానూ బరిలో నిలిచారు. పార్టీలో తన సేవలకు గుర్తింపుగా ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యురాలిగా తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు జితేందర్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

బిజినేపల్లి, జనవరి 25 : అనుమానాస్పద స్థితిలో రజీయా బేగం (30) అనే వివాహిత మృతి చెందిన ఘటన గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్సై రాములు తెలిపిన వివరాల మేరకు.. మృతురాలు రజీయా బేగం భర్త పిల్లలతో కలిసి బిజినేపల్లిలో నివాసం ఉంటున్నారు. కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఉరేసుకున్నట్లు చుట్టు పక్కల వారు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘట న స్థలాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మల్లురవికి విశ్వబ్రాహ్మణుల సన్మానం



మల్లురవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాల్ కోటాచారి

అచ్చంపేటటౌన్, జనవరి 25: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైన మల్లురవిని రాష్ట్ర విశ్వబ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు లాల్‌కోటాచారి, ఉపాధ్యక్షుడు చంద్రమౌళి గురువారం హైదరాబాద్ వారి నివాసంలో కలిసి పూల మొక్కలు అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారులుగా నియమితులు కావడం సంతోషకరమన్నారు. విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా మూడు ఆధార్ కేంద్రాలు: కలెక్టర్

నాగర్‌కర్నూల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అసౌకర్యం కలుగకుండా జిల్లాలో తాత్కాలికంగా మూడు ఆధార్ కేంద్రాలను శుక్రవారం నుంచి అందుబాటులోకి తెచ్చినట్లు కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్ తహసీల్దార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఒక ఆధార్ కేంద్రం వద్ద అధిక సంఖ్యలో ప్రజలు ఆధార్ అప్‌డేషన్, కేవైసీ కోసం వస్తున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని నాగర్‌కర్నూల్ ఎంపీడీవో కార్యాలయం, బిజినేపల్లి తహసీల్దార్ కార్యాలయం, తాడూరు తహసీల్దార్ కార్యాలయాల్లో ఈ నెల 31వ తేదీ వరకు తాత్కాలికంగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్ల ఆయన తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు ప్రతీ రోజు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తాత్కాలికంగా ఏర్పాటు చేసినా ఆయా ఆధార్ కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

'ఉపాధిలో కూలీల సంఖ్యను పెంచాలి'

అమ్రాబాద్ జనవరి 25: జిల్లాలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన అమ్రాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచే విధంగా ప్రతీ ఒక్కరు కృషి చేసి వారికి ఉపాధి కల్పించాలని నాగర్ కర్నూల్ జడ్పీ సీఈవో ఉష అన్నారు. 2023-24 వార్షిక సంవత్సరంలో మండలంలో గణనీయంగా కూలీల సంఖ్యను పెంచి పనులు కల్పించి ఆదుకోవాలని గురువారం అమ్రాబాద్ మండలం పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన మండల స్థాయి ఉపాధి హామీ పథకం సమీక్ష సమావేశంలో పాల్గొని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ పథకం ద్వారా మండలంలో అమలవుతున్న పలు అభివృద్ధి పనులను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, మండల పంచాయతీ అధికారి వెంకటయ్య, ఏపీవో రఘు, ఈసీ రేనయ్య, పంచాయతీ కార్యదర్శులు ,ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా ఉంటా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని, కార్యకర్తలకు కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో తిమ్మాజిపేట, తాడూరు మండలాల పార్టీ నాయకులతో, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే కథానాయకులని, కార్యకర్తల వల్లే ఇన్నేళ్లుగా పార్టీ బలంగా ఉందన్నారు. కేసీఆర్‌పై ప్రజల్లో సానుభూతి వెల్లువలా ఉందని ఈ పరిస్థితిని పార్లమెంట్ ఎన్నికల్లో సానుకూలంగా మలుచుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా వారిపై ఒత్తిడి తేవాలన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకాని శ్రీనివాస్‌యాదవ్, నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక కల్వకుర్తి ఇన్‌చార్జిగా కావలి వెంకటయ్య

చారకొండ, జనవరి 25: దివ్యాంగుల జాతీయ వేదిక కల్వకుర్తి ఇంచార్జిగా మండలంలోని తుర్కలపల్లి గ్రామానికి చెందిన కావలి వెంకటయ్య నియకమయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని దివ్యాంగుల జాతీయ వేదిక (ఎన్.పీ.ఆర్.డీ ఇండియా) కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్, రాష్ట్ర అధ్యక్షుడు దైన్యంపల్లి మల్లికార్జున్‌లు వెంకటయ్యకు నియమక పత్రాన్ని అంజజేశారు. జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్, రాష్ట్ర అధ్యక్షుడు దైన్యంపల్లి మల్లికార్జున్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ఉప్పునుంతల మండల అధ్యక్షుడు పద్మయ్య, శ్యాంసుందర్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

- నాగర్‌కర్నూల్‌లో ఎస్ఎఫ్ఐ నిరసన



నాగర్‌కర్నూల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 25: కొల్లాపూర్ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థినీని నైట్‌వాచ్‌మన్ నిరంజన్ ప్రేమ పేరుతో వేధించి మాయమాటలతో అపహరించిన సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తారాసింగ్ మాట్లాడుతూ ప్రిన్సిపాల్ తన సొంత పనులకు, పాఠశాల పనులకు వాచ్‌మన్ నిరంజన్‌కు ప్రతి పనిని అప్పగించడంతో పాఠశాలలోకి అనుమతించడంతోనే విద్యార్థినీని లొంగదీసుకున్నాడని ఆరోపించారు. వాచ్‌మన్ చర్యలపై అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా రాజకీయ అండదండలతో అతనిపై చర్యలు తీసుకోలేదన్నారు. సంఘటనకు కారణమైన పాఠశాల ప్రిన్సిపాల్‌పై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్, జిల్లా ఉపాధ్యక్షుడు కార్తీక్, నాయకులు తరుణ్, సుల్తాన్, మధు, వంశీ పాల్గొన్నారు.

ఉర్సు, జాతరలు మత సామరస్యానికి ప్రతీకలు



గుండూరులో గల ఉర్సులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎంపీ పోతుగంటి రాములు

కల్వకుర్తి, జనవరి 25 : మత సామరస్యానికి ఉర్సు జాతరలు దోహదపడుతాయని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని గుండూరు గ్రామ సమీపంలోని ఉర్సు జాతర, దర్గాను ఎంపీ రాములు దర్శించి స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతాలు వేరైనా మనుషులంతా ఒక్కటేనన్న భావంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. అనంతరం జాతరలో ప్రజలతో మమేకమై పలుకరిస్తూ ముందుకు సాగారు. సంతోష్‌కుమార్, రామేశ్వర్‌రావు, బాలేమియా, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైంది

- అదనపు కలెక్టర్ కుమార్ దీపక్
- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం
- విద్యార్థులతో అవగాహన ర్యాలీ

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 25: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎంతో విలువైన ఓటుహక్కు ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 14వజాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ హాజరై వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రతీ ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటుహక్కును కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. అంతకుముందు భారత ఎన్నికల సంఘం రూపొందించిన మై భారత్ హోమ్ పాటను ప్రదర్శించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఆర్డీవో రాంరెడ్డి, డీఆర్‌డీవో నర్సింగరావు, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, మత్స్యశాఖ అధికారి లక్ష్మప్ప, కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ జాకీర్ అలీ, డీటీ రఘు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల అవగాహన ర్యాలీ

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జడ్పీ మైదానం నుంచి శ్రీపురం చౌరస్తా మీదుగా పాత కలెక్టరేట్ వరకు ఇంటర్, డిగ్రీ విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని నాగర్‌కర్నూల్ ఆర్డీవో రాంరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించి వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ఆర్డీవో రాంరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. డీఈవో గోవిందరాజులు, డీపీవో కృష్ణ, ఇంటర్ విద్యా జిల్లా నోడల్ అధికారి వెంకటరమణ, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

● చారకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు తహసీల్దార్ కేసీ ప్రమీల ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ కేసీ ప్రమీల మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. అవినీతిని నిర్మూలించడానికి ఓటు హక్కును ఆయుధంగా ఉపయోగించుకోవాలని తహసీల్దార్ ప్రతిజ్ఞ చేయించారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువతీ యువకులకు తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు గుర్తింపు కార్డులను అందజేశారు. మండల కేంద్రానికి చెందిన సీనియర్ సిటిజన్ అయిన ఏమిరెడ్డి అందిరెడ్డిని తహసీల్దార్ శాలువాతో సత్కరించారు. నాయబ్ తహసీల్దార్ విద్యాధరిరెడ్డి, ఆర్ఐ నబి, వ్యాయామ ఉపాధ్యాయుడు పి. అంజయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయులు మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, రజిత, గీత, గౌరమ్మ, రాజేందర్‌రెడ్డి, కమలాకర్‌రావు, పి. అంజయ్య నవీన్, జంగునాయక్, సుందర్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాలల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి : ప్రజాస్వామ్యానికి ఓటు వెన్నుముక లాంటిదని తహసీల్దార్ యూసుఫ్ ఆలీ అన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో విద్యార్థులచే గ్రామంలో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులచే ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మద్దిలేటి, డిప్యూటీ తహసీల్దార్ వి.రమేష్, గిర్దావర్‌లు వెంకటేశ్, శివకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగశేషు, వార్డు మెంబరు డబ్బ ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్పీ రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు మణీశ్వర్, మేరీ, రాఘవేందర్, వెంకటస్వామిగౌడ్, సరళాదేవి, ప్రమీలా, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని తిమ్మాజిపేట మండల కేంద్రంలో పలు గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ జేకే.మోహన్ ఓటు మీ భద్రత మీ బాధ్యత అని విద్యార్థులకు సూచించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులచే ఎంపీవో బ్రహ్మచారి ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా నేరేళ్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కార్యకర్త పద్మ ప్రతిజ్ఞ చేయించి 18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

● లింగాల: మంల కేంద్రంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం జాతీయ ఓటర్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్‌చౌరస్తాలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. 18 సంవత్సరాల వయస్సు గల వారందరు ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో గీతాంజలి, తహసీల్దార్ ఉమ, హెచ్‌ఎం శేఖర్, ఆర్ఐ సీతారాం నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● బల్మూరు: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో పాఠశాల విద్యార్థులచే గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గాంధీ చౌరస్తాలో వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు, విద్యార్థులు కలిసి ఓటరు ప్రాధాన్యతను తెలియజేస్తూ ఓటు హక్కును న్యాయబద్ధంగా వినియోగించుకునేందుకు ప్రతి పౌరుడు ముందుండాలని వారు శపథం చేశారు. ఆయా శాఖల అధికారులతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

● కోడేరు: దేశ తలరాతను మార్చే వజ్రాయుధం ఓటు.. 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు తమ ఓటు కోసం ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సైదులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విద్యార్థులతో అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ చేసి మానవహారంగా ఏర్పడి ప్రతీ ఒక్కరు ఓటు కోసం నమోదు చేసుకుంటామని బస్టాండ్ కూడలిలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతీ ఒక్కరికి ఒక ఓటు మాత్రమే కల్పించిందన్నారు. రెవెన్యూ సిబ్బంది, మండల అభివృద్ధి అధికారి బాలచందర్ సృజన, ఎస్ఐ వి.శేఖర్‌రెడ్డి, సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్య అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఓటరు దినోత్సవాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

ప్రభుత్వం ప్రజల కోసం పనిచేసే విధంగా ప్రజల పక్షాన మాట్లాడే ప్రజా ప్రతినిధిని ఎన్నుకోవడంలో ఓటుహక్కు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నాయబ్ తహసీల్దార్ రాజుకుమార్, ఆర్ఐ బాలరాజు, సీనియర్ అసిస్టెంట్ భారతిబాయి, ఎంఈఓ భాస్కర్ రెడ్డి, జీహెచ్‌ఎం రాములు నాయక్, సిబ్బంది కళ్యాణ్, భగవంత్, మణెమ్మ, మహేష్ తదితరులు ఉన్నారు.

● పెంట్లవెల్లి: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని తహసీల్దార్ హిమబిందు అన్నారు. గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ హనుమంతు, జూనియర్ అసిస్టెంట్ ఉమాదేవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● అమ్రాబాద్: తహసీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం అమ్రాబాద్ మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ఓటర్లను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మదన్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఓటు హక్కు వినియోగంపైన విద్యార్థులకు అవగాహన కల్పించి ఈ విషయం పై సమాజంలో చైతన్యం తీసుకురావాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ తహసీల్దార్ రవూఫ్, మండల విద్యాధికారి బాలకిషన్, అధ్యాపకులు, అధ్యాప కేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

● ఊర్కొండ: మండల కేంద్రంలో జాతీయ దినోత్సవం పురస్కరించుకొని తహసీల్దార్ చెన్న కిష్టన్న ఆధ్వర్యంలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓటుపై అవగాహన కల్పించారు. నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, నవభారతి అసోసియేషన్ చైర్మన్ మ్యాకల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం



ర్యాలీలో మాట్లాడుతున్న ఆర్డీవో ఎస్.శ్రీను

కల్వకుర్తి, జనవరి 25 : ఓటు వజ్రాయుధం లాంటిందని కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి తహసీల్దార్ ఇబ్రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ అంబేడ్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ర్యాలీలో ఆర్డీవో హాజరై ప్రసంగించారు. అనంతరం వృద్ధులను ఆర్డీవో ఎస్.శ్రీను, తహసీల్దార్ ఇబ్రహీం, నాయకులు శాలువా, పూల మాలలతో సత్కరించారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షానవాజ్‌ఖాన్, పలువురు అధ్యాపకులు, విద్యా ర్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఆదేవిధం గా కల్వకుర్తి పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌ల ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వైస్ చైర్మన్‌షాహేద్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అధికారులు మండల ప్రజలతో కలిసి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తబితారాణి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. డీటీ సరస్వతి, ఆర్ఐ రాజేశ్వర్‌రెడ్డి, అకౌంటెంట్ అబ్రహం ఉన్నారు.



పెద్దకొత్తపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

● బిజినేపల్లి: ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు సామాన్యుడి చేతిలో ఉన్న వజ్రాయుధమని తహసీల్దార్ జనుంపల్లి శ్రీరాములు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని ప్రజలతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేసి మాట్లాడారు.

● కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొల్లాపూర్ పట్టణంలో జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామారాజు యాదవ్ మాట్లాడారు. ఎన్ఎస్ఎస్, పీవోఎం కుర్మయ్య రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు ఎన్.స్వామిసాగర్, కళాశాల అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తెలకపల్లి, జనవరి 25 : మండల పరిధిలోని రాంరెడ్డిపల్లిలో గ్రామపంచాయతీ నూతన భవనాన్ని, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ గురువారం ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మనోహర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎంపీ ఫండ్ నుంచి 20 లక్షల రూపాయలతో గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించారు. ఆర్‌జీఎస్‌ఏ నుంచి వచ్చిన నిధులు 20లక్షల రూపాయలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ కార్యక్రమాలు కూడా అమలు జరుగుతాయని ప్రజలకు నచ్చిన విధంగా పాలన సాగుతుందన్నారు. ఇటీవల గుండెపోటుకు గురైన మాజీ వైస్‌ఎంపీపీ నరేందర్‌గౌడ్‌ను పరామర్శించారు.

'సమసమాజ నిర్మాణానికి అభ్యుదయ సాహిత్యం అవసరం'

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 25: ప్రస్తుత సమాజంలో సమసమాజ నిర్మాణానికి అభ్యుదయ సాహిత్యం అవసరమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) నూతన క్యాలెండర్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహతో పాటు ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు హెచ్.ఆనంద్‌జీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సీపీఐ రాష్ట్ర నాయకుడు ఆనంద్‌జీ మాట్లాడగా, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కల్వకోలు మద్దిలేటి, కార్యదర్శి బొడ్డుపల్లి సాయిశంకర్, అంబేడ్కర్ ఐడియాలజీ మిషన్ జిల్లా అధ్యక్షుడు తలారి మద్దిలేటి, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు ఎస్.ఈశ్వర్, చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల అమరగిరి క్షేత్ర పర్యటన

కొల్లాపూర్, జనవరి 25 : కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా అమరగిరిలో ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ క్షేత్ర పర్యటనలో భాగంగా విద్యార్థులు చెంచుల జీవన విధానం, వారి సంస్కృతి, సాంప్రదాయాలు, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియత్ హాజరై మాట్లాడారు. ఇఫ్లూ యూనివర్సిటీ నుంచి విచ్చేసిన డాక్టర్ అమృత్ మాట్లాడగా, సోషల్ వర్క్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ వేంకటేశం, దేవరాజు, రమణ, డాక్టర్ సాయిలు, సోషల్ వర్క్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ కళాకారులకు పింఛన్ ఇవ్వాలి



నాగర్‌కర్నూల్ ఆర్డీవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా నాట్యమండలి కళాకారులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 25: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అందరు కళాకారులను గుర్తించి వృద్ధ కళాకారులకు పింఛన్‌తో పాటు రెండు వందల గజాల ఇంటి స్థలం ఇవ్వాలని తెలంగాణ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి పెబ్బెటి విజయుడు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో వృద్ధ కళాకారులు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి నాగర్‌కర్నూల్ ఆర్డీవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు తుపాకుల వెంకటేష్, సహాయ కార్యదర్శి బి.శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడు తస్నీరు నరసింహ, కళాకారులు మల్లయ్య, గోపాల్, నరసింహ, లక్ష్మయ్య, గాలెన్న, పర్వతాలు, యాదగిరి, మధు, ఊషన్న, ఆనంద్, కావలి నాగన్న, సైదులు, శివశంకర్, కొత్తరామస్వామి, రాయిపాకుల రవి, రాములమ్మ, సీపీఐ నాయకులు హెచ్.ఆనంద్‌జీ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నవయువ ఓటర్ల సమ్మేళనం

- వర్చువల్‌గా పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

కల్వకుర్తి, జనవరి 25 : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఏఎంవో నవమతం డాటా(నవ యువ ఓటర్ల) సమ్మేళనం బీజేవైఎం రాష్ట్ర నాయకుడు అభిలాష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగింది. కార్యక్రమంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొని నవ ఓటర్లకు మార్గదర్శనం చేశారు. ఓటు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. నాయకులు మల్లేష్‌యాదవ్, పర్వతాలు, లక్ష్మీకాంత్, చందు, పట్టణ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, లల్లుయాదవ్, శివాజీ, సుమన్, ప్రసాద్, చంద్రశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

● కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్‌లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నూతన ఓటర్ల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నూతన ఓటర్లనుద్దేశించి చేసిన ప్రసంగాన్ని బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి అనువదించి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీజేపీ సీనియర్ నాయకుడు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బీజేవైఎం నాయకుడు అతినారపు వెంకటేశ్, రాము, హుస్సేన్, ఖాసీమ్, విజయేందర్‌రెడ్డి, బీజేపీ టౌన్ అధ్యక్షుడు ఎలిమె రాము, బిజినేపల్లి మండల అధ్యక్షుడు భూషయ్య, నాయకులు ప్రమోద్‌కుమార్, రాజేశ్వర్‌రెడ్డి, భరత్‌రావు, జిల్లా కార్యాలయ కార్యదర్శి చందు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

అచ్చంపేటటౌన్, జనవరి 25: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నాగర్‌కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బాలసదన్‌లో చిన్నారులకు జిల్లా సెక్రటరీ రమేష్ రెడ్డి గురువారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల చదువుకు అవసరమైన పుస్తకాలు, నోట్సుబుక్స్, వైద్యసేవలు లాంటివి ఏవిధమైన సహాయం అవసరమైనా రెడ్‌క్రాస్ సొసైటీ ఎప్పుడూ ముందు ఉండి ఆదుకుంటుందన్నారు. వైస్ చైర్మన్ శ్రీధర్, యూత్ రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ కుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు అశోక్ ప్రసాద్, లోక్యానాయక్, కృష్ణరావు, హన్మంత్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు ప్రసన్న, బాలసదన్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

'పోలీసుల తీరును ఖండిస్తున్నాం'

అచ్చంపేటటౌన్, జనవరి 25: అణిచివేతను అవలంబిస్తున్న పోలీసుల తీరును ఖండిస్తున్నామని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కొండ్రెడ్డి చందు అన్నారు. గురువారం పట్టణంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అగ్రికల్చర్ యూనివర్సిటీలో భూములను రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నియమించడంపై రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, జీవో55ని రద్దుచేయాలని విద్యార్థులు నిరసన తెలుపుతుంటే లాఠీచార్జి చేసిన పోలీసుల తీరు చాలా బాధాకరమన్నారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝూన్సీ వెంబడించి మరీ జుట్టు పట్టుకుని లాగిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీగా కోదండరామ్ ఎంపికపై హర్షం



ఊర్కొండలో బాణసంచా కాల్చుతున్న నాయకులు

ఊర్కొండ, జనవరి 25: తెలంగాణ జేఏసీ కన్వీనర్ కోదండరామ్‌ను ఎమ్మెల్సీగా ఎంపిక చేయడంతో టీజేఎస్ జడ్చర్ల నియోజకవర్గం నాయకుడు అలకుంట వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. నాయకులు కంఠం విజయుడు, శివకుమార్, రఫీక్, దయాకర్, శంకర్ తదితరులు ఉన్నారు.

ఓపెన్ డిగ్రీ తరగతులు ప్రారంభం

అచ్చంపేట, జనవరి 25: బల్మూరు మండల పరిధిలోని కొండనాగుల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ తరగతులు ఈ నెల 28 ఆదివారం నుంచి తరగతులు ప్రారంభమవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రం అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు జరుగుతాయని తప్పనిసరి హాజరుకావాలని తెలియజేశారు.

దాతల ప్రోత్సాహం అభినందనీయం

వంగూరు, జనవరి 25: విద్యార్థులను విద్యకు ప్రోత్సహిస్తూ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతల సహకారం అభినందనీయమని ఎంఈవో శంకర్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని వెల్మలపల్లిలో గ్రామానికి చెందిన బాలరాజు సహకారంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులకు ఎంఈవో శంకర్‌నాయక్ టై, బెల్టులను పంపిణీ చేశారు. ఎచ్ఎం చిన్నయ్య, రాధిక, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం

కల్వకుర్తి, జనవరి 25 : కల్వకుర్తి పట్టణంలోని జేపీనగర్‌లో గల జానం పాడ్ సైదులు బాబా దర్గాలో జరుగుతున్న గంధోత్సవంలో మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. ఇంద్రానగర్ కాలనీకి చెందిన బతుక మనెమ్మ ప్రతి సంవత్సరం నిర్వహించే జాన్‌పాడ్ సైదులు బాబా దర్గా కందూరు కార్య క్రమం నిర్వహిస్తోంది. కౌన్సిలర్ సైదులుగౌడ్, నాయకులు తాహేర్‌అలీ, యువకులు వంశీయాదవ్, రాకేష్, ఆనంద్, శివ, సాయి, కిరణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బూత్ లెవల్ సమావేశానికి ఉప్పునుంతల కాంగ్రెస్ నాయకులు

ఉప్పునుంతల, జనవరి 25: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్ర సాయి బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశానికి గురువారం ఉప్పునుంతల మండలంలోని కాంగ్రెస్ బీఎల్ఏలు 34 మంది శిక్షణకు తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల నాయకులు అనంతారెడ్డి యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రేణయ్య, నాయకులు కృష్ణ, శేఖర్‌గౌడ్, మహేష్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో దేహదారుఢ్యం

ఉప్పునుంతల, జనవరి 25: భారత గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గత మూడు రోజులుగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించిన్నట్లు హెచ్‌ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. గురువారం క్రీడల ముగింపు సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి తోడ్పడి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు గణతంత్ర దినోత్సవం పతాక ఆవిష్కరణ అనంతరం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

తిమ్మాజిపేట, జనవరి 25 : ప్రభుత్వం మైనార్టీలకు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీవో కరుణశ్రీ సూచించారు. మండల పరిధిలోని గొరిటలో మైనార్టీ కార్పొరేషన్ అందించిన రుణాలతో ఏర్పాటు చేసుకున్న కిరాణం కొట్టును గురువారం పరిశీలించారు. అనంతరం నర్సరీలో పెంచుతున్న లక్ష మొక్కలను ఆమె పరిశీలించి పలు సూచనలు, సలహాలు చేశారు. నర్సరీ నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎప్పటికప్పుడు బాధ్యతగా నీరు పట్టాలని ఆమె సూచించారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 25: ట్రాన్స్‌పోర్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ పరిపాలనాధికారి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులకు నెలకు రూ.4500 నిరుద్యోగ భృతి చెల్లించడంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రవాణారంగ కార్మికులు ఆనంద్, సుభాష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాడూరు ఎస్ఐగా మహేష్



తాడూరు, జనవరి 25: తాడూరు మండల నూతన ఎస్ఐగా మహేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎస్ఐ రామన్ గౌడ్ నాగర్‌కర్నూల్ ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయడంతో వనపర్తి జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 2020 బ్యాచ్‌కు సంబంధించిన ఎస్ఐ మహేష్‌ను జనరల్ ట్రాన్స్‌ఫర్‌లో భాగంగా తాడూరు మండలానికి నియమించడం జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం చట్ట పరిధిలోని అన్ని పనులు కొనసాగేలా చూస్తామన్నారు. శాంతి భద్ర తలకు విఘాతం కలిగించినట్లయితే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.